క్లుప్తంగా

ఘనంగా వీరభద్ర సేవ



అచ్చంపేట రూరల్: శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రంలో మంగళవారం తెల్లవారుజామున కౌన్సిలర్ శివ ఆధ్వర్యంలో వీరభద్ర సేవను ఘనంగా నిర్వహించారు. సేవలో భాగంగా మహదేవ్ అగ్ని విన్యాసాలు ఆకట్టుకున్నాయి. మూడవ కన్ను నుంచి మంటలు వచ్చే ఆకృతి, శివతాండవం వంటి కళాకారుల ప్రదర్శనలు ఇచ్చి భక్తిని చాటుకున్నారు. అగ్నిగుండంలో నడిచి మొక్కులు చెల్లించుకున్నారు.

శివాజీ విగ్రహం ఏర్పాటుకు భూమి పూజ

లింగాల: మండలంలోని అప్పాయపల్లిలో ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకు మంగళవారం భూమి పూజ నిర్వహించారు. శివాజీ విగ్రహం ఇప్పించేందుకు గ్రామానికి చెందిన దాత రామావత్ లక్ష్మణ్‌నాయక్ ముందుకు వచ్చారు. కార్యక్రమంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు సలేశ్వరం, బాలరాజు, మల్లేష్, పర్వతాలు, ప్రసాద్, శ్రీరామ్, సూర్యం, హరీష్ అశోక్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

లింగాల: కారు అదుపుతప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం తెలకపల్లి మండలం గోలగుండం గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు అంబట్‌పల్లి నుంచి స్వగ్రామానికి వెళ్తున్నారు. మండలంలోని శాయిన్‌పేట శివారుకు రాగానే కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పంట పొలంలో దూసుకెళ్లి ఆగిపోయింది. కారు పాక్షికంగా దెబ్బతిన్నది. కారులో ఉన్న వ్యక్తులు సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు: కానిస్టేబుల్‌కు గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం: కారు బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో కానిస్టేబుల్‌కు గాయాలైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం కోర్టులో విధులు నిర్వర్తిస్తున్న కానిస్టేబుల్ శ్రీనివాసులు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా జిల్లా కేంద్రంలోని పోలీసుస్టేషన్ గేటు ఎదుట కర్ణాటకు చెందిన కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కానిస్టేబుల్ శ్రీనివాసులుకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. కారును స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

జైపాల్‌రెడ్డికి ఘన నివాళి



సాక్షి, నెట్‌వర్క్: నాగర్‌జిల్లాలోని వివిధ మండలాల్లో కేంద్ర మాజీ మంత్రి జైపాల్ రెడ్డి జయంతిని మంగళవారం నిర్వహించారు. కల్వకుర్తి రూరల్ పరిధిలోని మార్చాల, కొల్లాపూర్ పట్టణంలోని శ్రీవాణి విద్యానిలయం, చారకొండ మండలంలోని సిర్సనగండ్ల, జూపల్లి, వెల్దండ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జైపాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీపీసీసీ నాయకులు రంగినేని జగదీశ్వరుడు, శ్రీధర్‌రెడ్డి, సందీప్ రెడ్డి, వెల్దండ సర్పంచ్ భూపతిరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్న ప్రసాద వితరణ

కందనూలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం రోగి సహాయకులకు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో అన్న ప్రసాదాన్ని వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి కన్వీనర్ హకీమ్ విశ్వప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో సత్యసాయి సేవా సంస్థల ద్వారా ఆరు సంవత్సరాలుగా ప్రతి రోజు నిత్యాన్న ప్రసాద పంపిణీ ఉచితంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సాయి ప్రకాష్, మిడిదొడ్డి లక్ష్మణ్, ఇరువెంటి బాలయ్య, మిడిదొడ్డి శేఖర్, గిరి, మశన్న, గోవర్ధన్, నంద కిషోర్ నాగేశ్వరి భక్తులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెల్దండ: మండలంలోని పోతేపల్లిలో సోమవారం రాత్రి 8.30 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి అనుమానంతో తిరుగుతున్నాడు. ఇటీవల గ్రామానికి చెందిన గన్నోజు సత్తయ్యచారి ఇంటి వద్ద ఉన్న డ్రిల్లింగ్ మిషన్ దొంగలు ఎత్తుకెళ్లారు. దీంతో బాధిత కుటుంబసభ్యులు, గ్రామస్తులు గ్రామంలో అనుమానంగా తిరుగుతున్న హైదరాబాదులోని బండ్లగూడకు చెందిన మహ్మద్ అక్రమ్(58)ను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. అనారోగ్యంతో బాధపడుతుండటంతో పోలీసులు చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మహ్మద్ అక్రమ్ మృతి చెందినట్లు ఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపారు. కార్యదర్శి ప్రదీప్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహంను కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీలో ఉన్నట్లు తెలిపారు.



కల్వకుర్తి మండలం పంజుగులలో



అచ్చంపేటలో



కొల్లాపూర్ అయ్యప్ప ఆలయంలో

ఆనందోత్సవాల సంక్రాంతి



ఉప్పునుంతల మండలం పెనిమిళ్లలో



బల్మూరు మండలం రామాజిపల్లిలో..

కల్వకుర్తిరూరల్: జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి పండుగ సంబరాలను మూడురోజుల పాటు ఆనందోత్సవాల మధ్య నిర్వహించుకున్నారు. మూడో రోజు మంగళవారం కనుమ పండుగ సందర్భంగా ఇళ్ల ఎదుట చక్కగా ముగ్గులను తీర్చిదిద్దారు. పంజుగులలో ఎద్దులబండ్లను ఊరేగించారు.

అచ్చంపేట రూరల్: మండల వ్యాప్తంగా ఇళ్ల ఎదుట అందమైన రంగువల్లులు మహిళలు తీర్చిదిద్దారు. గొబ్బెమ్మలను నవధాన్యాలను ఉంచారు. పిండి వంటలను తయారు చేసుకుని ఆరగించారు. చిన్నారులు గాలిపటాలు ఎగురవేశారు.

కొల్లాపూర్: రామాలయం, మాధవస్వామి దేవాలయం, బండాయిగుట్ట వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో కల్యాణోత్సవాలు నిర్వహించిన అనంతరం సోమవారం రాత్రి స్వామివారి విగ్రహాలను పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు.

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో బండ్లు, వాహనాల ఊరేగించారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంతో పాటు గౌరారం, నడిగడ్డ తదితర గ్రామాల్లో ఎద్దులకు, ఎద్దుల బండ్లకు, ఇతర వాహనాలకు అలంకరించి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. వివిధ గ్రామాలలో సంక్రాంతి సందర్భంగా వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఇంటి ముందు కల్లాపి చల్లి రంగురంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి పాల పొంగించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు, యువకులకు వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించారు.

చారకొండ: మండలంలోని జూపల్లిలో మహిళలు ముగ్గులు వేసి ఆకట్టుకున్నారు. వివిధ రంగులను అద్దారు. ఇళ్లలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లి లక్ష్మీనరసింహ్మస్వామి, పెద్దాపూర్ సమీపంలోని చెన్నకేశవ స్వామి, లక్ష్మాపూర్, మర్రిపల్లి, వెల్టూరులో ఇదమ్మ అమ్మవారి ఆలయాల చుట్టూ అలంకరించిన ఎద్దుల బండ్లను ప్రదక్షిణలు చేయించి మొక్కులు తీర్చుకున్నారు. పెనిమిళ్లలో నిర్వహించిన ఎద్దుల బండ్ల గానుగ పోటీల కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. పెద్దపూర్ చెన్నకేశవ స్వామి ఉత్సవాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

అమ్రాబాద్: ఆడపడుచులు ఇళ్ల ముందు రంగులతో ముగ్గులు వేసి వాకిళ్లను అందంగా అలంకరించారు. సంక్రాంతి సందర్భంగా రకరకాల వంటలు చేసుకొని ఆనందోత్సాహంగా గడిపారు. కొత్త అల్లుల్లు ఆడపడుచులతో పల్లెలు సందడిగా మారాయి.

బల్మూర్: పట్టణాల్లో ఉన్న జనం గ్రామాలకు చేరుకోవడంతో గ్రామాలు కళకళలాడాయి. మండలంలోని తుమ్మెన్‌పేట ఈదమ్మ ఆలయం చుట్టూ ఎడ్ల బండ్లు, ట్రాక్టర్లతో ప్రదక్షిణలు చేశారు.

లింగాల: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో వాహనాలను, ఎద్దుల బండ్లను అందంగా అలంకరించి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ముగ్గుల పోటీలను ఏర్పాటు చేసి బహుమతులను అందజేశారు.



చారకొండ మండలం జూపల్లిలో



పెంట్లవెల్లిలో..



బల్మూర్ మండల తుమ్మెన్‌పేటలో



తాడూరులో



తెలకపల్లి గౌరారంలో



పెద్దకొత్తపల్లిలో

భక్తిశ్రద్ధలతో ప్రభోత్సవం



ఉప్పునుంతలలో ప్రభోత్సవ ఊరేగింపు

అమ్రాబాద్: మండల కేంద్రంలోని అమరేశ్వరాలయం నుంచి సోమవారం రాత్రి నిర్వహించిన ప్రభోత్సవం భక్తి శ్రద్ధలతో కొనసాగింది. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో పార్వతీ పరమేశ్వరుని చిత్రపటాలు ఉంచి పుర వీధుల గుండా ఊరేగించారు. మహిళలు యువకుల కోలాటాలు, భజనలు, నృత్యాలు, చూపరులను ఆకట్టుకున్నారు. ఊరేగింపు అనంతరం రాత్రి ప్రభోత్సవాలను ఉమామహేశ్వరం క్షేత్రానికి తీసుకెళ్లారు. ఆలయ కమిటీ అధ్యక్షులు నాగరాజు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: స్థానిక కేదారేశ్వరాలయం నుంచి సోమవారం రాత్రి ప్రభోత్సవ కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రభోత్సవం వేడుకగా ఉమామహేశ్వరానికి తరలివెళ్లారు. ప్రత్యేకంగా అలంకరించి డీసీఎంలో ప్రభను గ్రామంలో ఊరేగించారు. అనంతరం అచ్చంపేట మీదుగా ఉమామహేశ్వరానికి తరలించి భోగమహేశ్వరంలో మంగళవారం తెల్లవారుజామున నిర్వహించిన స్వామివారి కల్యాణంలో పాల్గొన్నారు. ప్రభోత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచు కట్టా సరిత, ఉప సర్పంచు పుల్లమ్మ, ఆలయ కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, ప్రభోత్సవ కమిటీ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, సురేష్‌రెడ్డి తదితరులు, నాయకులు అనంతరెడ్డి, జంగిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

మన్ననూర్: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయం కమిటీ ఆధ్వర్యంలో ఉమామహేశ్వర ప్రభోత్సవం ఆలయ ప్రాంగణం నుంచి సోమవారం నిర్వహించారు. ప్రభోత్సవాన్ని పుర వీధుల గుండ ఊరేగించారు. అంతకు ముందు ఆలయ కమిటీ అధ్యక్షుడు పిట్టల సురేష్‌తో కలిసి జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ ఆలయం ముందు ఏర్పాటు చేసిన హైమాస్టు లైట్లను ప్రారంభించారు. సర్పంచ్ శ్రీరాం, ఉప సర్పంచ్ నారాయణమ్మ, ఎంపీటీసీలు శ్రీనివాసులు, రహీం, బాలమ్మ, కమిటీ సభ్యులు శేఖర్, చంద్రమౌళి, రాము, బాలకృష్ణ, అభిషేక్, రమేష్, శివ, నాగరాజు, మహిళా కమిటీ భక్తులు సరస్వతి, జయమ్మ. రాజేశ్వరి, ప్రభావతమ్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రంగనాయకస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కందనూలు: జిల్లా కేంద్రంలోని రామాలయంలో మంగళవారం గోదాదేవి, రంగనాయక స్వామివారి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా 18 మంది దంపతులు కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. విశ్వక్సేన ఆరాధన, పుణ్యావాచనం,రక్షాబంధనం, యజ్ఞోపవీతధారణ, మధుపర్కం, కన్యాదానం, మాంగల్యధారణ, మాలమార్పిడి, తలంబ్రాలు, వారణం మాయూరం తదితర కైంకర్యాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం రామాలయ భజన మండలి సభ్యులు, సత్యసాయి సభ్యులు భక్తి గీతాలను ఆలపించారు. చిన్నారి బూర్గుల మహతి సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులను అలరించాయి. కార్యక్రమంలో కందాడై వరదరాజన్ అయ్యంగార్, కందాడై శ్రీనివాసచార్యులు, కే.గోపాలచార్యులు, గోమటం మురళీమోనాచార్యులు, చక్రవర్తి, రాఘవాచార్యులు, శేషాచార్యులు, టి.యాదగిరి, నంద కిషోర్, వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు మహిళలు పాల్గొన్నారు.

గోమాతకు పూజలు



తెలకపల్లి: మండల కేంద్రంలో శ్రీముఖ దుర్గాదేవి ఆలయంలో గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనుమ పండుగను పురస్కరించుకుని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధార్మిక పరిషత్ ఆధ్వర్యంలో దుర్గాదేవి ఆలయం ఎదుట సకల దేవతా స్వరూపిని గోమాతకు షోడచోపచార పూజలు చేశారు. పూజారి ఉమాపతి ఆచారి, రాధిక, పుష్పమ్మ, శ్రీనివాసులు, వెంకటాచారి, చంద్రశేఖర్, శివ, మల్లేష్, రవికుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



వెల్దండ: మండలంలోని చెర్కూర్‌లో ఈతమ్మ మాదాంత ఉత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఎమ్మెల్యే పట్టువస్త్రాలను సమర్పించారు. సర్పంచ్ రేవతి, భూపతిరెడ్డి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, నాయకులు గోపాల్‌నాయక్, రాజశేఖర్, మోతిలాల్‌నాయక్, రామచంద్రయ్య తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని తాండ్రలో మాందాత ఉత్సవాలకు మంగళవారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరై ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి సత్కరించారు. అనంతరం మాజీ సర్పంచ్ గోలి కమలమ్మ నివాసంలో ముందస్తుగా ఎమ్మెల్యే జన్మదినం పురస్కరించుకొని కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, మాజీ సర్పంచ్ ఆనంద్, విజయ్‌కుమార్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, భూపతిరెడ్డి, రమాకాంత్‌రెడ్డి, షానావాజ్‌ఖాన్ గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



తాండ్రలో విజేతలతో నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మాజీ కమిటీ సభ్యుడు నాగపూర్ మధు అన్నారు. మంగళవారం మండలంలోని బొందలపల్లిలో వ్యవసాయ కార్మిక సంఘం, డీవైఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను ఆయన ప్రదానం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, సీపీఎం మండల కమిటీ సభ్యులు సుభాష్, సురేష్, గ్రామ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మల్లికార్జున్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

లింగాల: మండలంలోని రాయవరంలో గ్రామానికి చెందిన ఉల్లంగొండ్ల రాజు, శ్రీనుయాదవ్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన వివిధ రకాల క్రీడా పోటీలు మంగళవారం ముగిశాయి. క్రికెట్‌లో మొదటి బహుమతి రాయవరం, రెండో స్థానంలో క్యాంపు రాయవరం, వాలీబాల్‌లో ప్రథమ బహుమతి రాయవరం, రెండో బహుమతి క్యాంపు రాయవరం, ఎద్దుల బండి పోటీలో రాయవరానికి చెందిన బాలస్వామి విజేతగా నిలువగా 3 తులాల వెండిని అందజేశారు. ముగ్గుల పోటీలో మొదటి బహమతి కె.రాణి, రెండో బహమతి మల్లేశ్వరీ, మహేశ్వరి గెలుపొందారు. విజేతలకు షీల్డ్‌తో పాటు, నగదును ప్రదానం చేశారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసులు, సర్పంచు శేషయ్య, గ్రామానికి చెందిన యువత పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని తాండ్రలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన ప్రీమియర్ లీగ్-2 క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఫ్లయింగ్ ఈగల్ మొదటి స్థానంలో నిలిచింది. విజేత జట్టుకు బహుమతిగా రూ.15116లు గ్రామానికి చెందిన సుదర్శన్‌రెడ్డి అందజేశారు. 2వ స్థానంలో నిలిచిన తాండ్ర కింగ్స్ జట్టుకు బహుమతి రూ.10116 గ్రామానికి చెందిన శ్రీనివాస్ ప్రదానం చేశారు. బహుమతులను బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి సమకూర్చారు. కార్యక్రమంలో గోలి సురేందర్‌రెడ్డి, ఈశ్వరయ్య, ఆనంద్, బాలజంగయ్య, క్రీడాకారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వెల్దండ: మండలంలోని రాచూర్‌లో నిర్వహించిన వాలీబాల్ పోటీలు పోటాపోటీగా కొనసాగాయి. సోమవారం విజేతలకు బహుమతులను అందజేశారు. అదేవిధంగా పలు గ్రామాల్లో క్రికెట్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దోమలపెంట: గ్రామానికి చెందిన కటకం వెంకటేష్ తల్లి జ్ఞాపకార్థం వెంకటేశ్వర్ల బావి, తుర్కపల్లి, పదరలో ముగ్గుల పోటీలను నిర్వహించారు. ప్రతిభ కనపరిచి మహిళలకు బహుమతులు అందజేశారు.

వైభవంగా కాటమయ్య బోనాలు



చారకొండ: మండలంలోని జూపల్లిలో గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కాటమయ్య బోనాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనాలను అలంకరించి డప్పు, వాయిద్యాల చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. గ్రామ దేవతలను దర్శించుకుంటు నైవేద్యం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు పూనకాలు ఊగారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షుడు ఉసేన్ గౌడ్, దశరథం గౌడ్, సభ్యులు లింగయ్య గౌడ్, వెంకటయ్య గౌడ్, కృష్ణయ్యగౌడ్, కొండల్ గౌడ్, శ్రీరాములు, శ్రీనివాస్ గౌడ్, సైదులు, అశోక్, నరేష్, అల్లాజి, బాలయ్య, శ్రీను, గ్రామస్తులు, మహిళలు నాయకులు పాల్గొన్నారు.

మాయావతి జన్మదిన వేడుకలు

అచ్చంపేట రూరల్: పట్టణంలో బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు కుమారి మాయావతి జన్మదిన వేడుకలను సోమవారం నిర్వహించారు. పలు ప్రాంతాల్లో కేక్‌కట్ చేసి పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఆర్మీడే

వెల్దండ: మండల కేంద్రంలో ఆకృతి గార్డెన్‌లో సోమవారం ఆర్మీడే వేడుకలను జవాన్లు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈసందర్భంగా ఆర్మీ జవాన్లను సర్పంచ్ భూపతిరెడ్డి శాలువాలతో సన్మానించారు. అనంతరం డిఫెన్స్ కాలనీ నామకరణం, జవాన్లు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, బచ్చు రామకృష్ణ, జవాన్లు వెంకట్‌రెడ్డి , చంద్రశేఖర్, పురుషోత్తం, ఆర్. శ్రీనివాసులు, తదితరులు ఉన్నారు.

స్టూళ్ల వితరణ

కొల్లాపూర్: పట్టణం సమీపంలోని ఎంసీహెచ్ ప్రభుత్వ ఆస్పత్రికి వనపర్తిలోని ఎంఎస్‌ఆర్ క్లినిక్ ఆస్పత్రి వైద్యుడు డాక్టర్ రమేష్ 50 స్టూళ్లను మంగళవారం ఎంసీహెచ్ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి



పెంట్లవెల్లి: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మంగళవారం మండలంలోని జటప్రోలులో మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి పురాతనమైన వేణుగోపాల స్వామి ఆలయాన్ని, హరిత హోటల్‌ను సందర్శించారు. మదనగోపాల స్వామి ఆలయానికి సంబంధించిన వివరాలు అందించాలని అధికారులకు సూచించారు. వేణుగోపాల స్వామి ఆలయాన్ని పూర్వవైభవం తీసుకొస్తామని మంత్రి అన్నారు. మాజీ ఎంపీపీ గోవింద్‌గౌడ్, వైస్ ఎంపీపీ భీంరెడ్డి, నాగిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎండీ కబీర్, ఆసిఫ్, గోపాల్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

లింగాల: మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2013–14 విద్యా సంవత్సరం పదో తరగతి చదివిన విద్యార్థులు మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ప్రస్తుతం చేస్తున్న చేస్తున్న ఉద్యోగాలు, కుటుంబవివరాలను అడిగి తెలుసుకున్నారు. అప్పటి గురువులను సన్మానించారు. అనంతరం సామూహిక భోజనాలను చేశారు.

యువకులపై కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: యువతిని ఈవ్‌టీజింగ్ చేసిన ఘటనలో ఆరుగురి యువకులపై కేసునమోదు చేసినట్లు షీటీం ఏఎస్‌ఐ విజయలక్ష్మి మంగళవారం తెలిపారు. ఏఎస్‌ఐ వివరాల ప్రకారం హైదరాబాద్‌కు చెందిన ఓ యువతి జిల్లా కేంద్రంలోని మినీ ట్యాంక్ బండ్‌ను చూసేందుకు వచ్చింది. అక్కడే ఉన్న ఆరుగురు యువకులు యువతితో ఈవ్ టీజింగ్‌కు పాల్పడ్డారు. గమనించిన స్థానికులు షీటీంకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకొని ఆరుగురిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ ఘటనలో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ పేర్కొన్నారు.

పందెం రాయుళ్లపై

కొడేరు: మండలంలోని మాచుపల్లి శివారులో కొందరు కోడి పందెలు ఆడుతునట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు మంగళవారం కోడి పందేల స్థావరానికి ఎస్‌ఐ శేఖర్ రెడ్డి సిబ్బందితో చేరుకున్నారు. పందెం కోళ్లతో పాటు రూ. 21190ల నగదును స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

బ్లాక్‌బోర్డులు అందజేత

కల్వకుర్తిరూరల్: మండలంలోని సుద్దకల్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న సమస్యలపై సోమవారం సాక్షిలో చదువులు సాగేదెట్లా అనే కథనం ప్రచురితమైంది. స్పందించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు సందీప్ నాలుగు బ్లాక్ బోర్డులను, లైట్లను వితరణ చేశారు. ఉపాధ్యాయుడు గతంలో అదే పాఠశాలలో విధులు నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు ఉపాధ్యాయుడిని అభినందించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మన్ననూర్: నల్లమల రాంపూర్ పెంటలో తల్లి ఇద్దరు పిల్లలు ఆత్మహత్యకు పాల్పడిన ఆ కుటుంబాన్ని నిజనిర్ధారణ కమిటీ ఆధ్వర్యంలో కుల నిర్మూలన పోరాట కమిటీ రాష్ట్ర నాయకుడు ముద్దునూరి లక్ష్మీనారాయణ మంగళవారం పరామర్శించారు. అనంతరం మన్ననూర్‌లోని అంబేడ్కర్ కూడలిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చెంచు పెంటల్లో ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించాలని కోరారు. ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిజనిర్ధారణ కమిటీ సభ్యులు జక్క బాలయ్య, ఎడ్ల అంబయ్య, అనిల్, బియ్యని వెంకటేష్ పాల్గొన్నారు.

పట్టువస్త్రాలతో ఊరేగింపు

తెలకపల్లి: మండల కేంద్రంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో అచ్చంపేటలోని ఉమామహేశ్వర స్వామికి పట్టు వస్త్రాలను సోమవారం ఊరేగింపుగా తీసుకెళ్లారు. గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

ఎత్తం గట్టుకు పోటెత్తిన జనం



కొడేరు: మండలంలోని ఎత్తం గట్టుపై నిర్వహించిన రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. స్వామివారిని దర్శించుకునేందుకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు అన్నదానం చేశారు. ఎస్‌ఐ శేఖర్ రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కోఆప్షన్ మెంబర్ స్వామి, తదితరులు ఉన్నారు.

పోలీసులకు ఫిర్యాదు

పెద్దకొత్తపల్లి: మండలంలోని నక్కలపల్లిలో రెడ్డిసేవా సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీని సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తీసుకెళ్లారు. ఈ విషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో రెడ్డి సేవా సమితి గ్రామ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి మంగళవారం ఫిర్యాదు చేశాడు.